




పెంచికల్‌పేట మీదుగా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న పోలీసులు(ఫైల్)

మూగ రోదన

జిల్లా నుంచి పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సంతల ముసుగులో గుట్టుగా పెద్ద సంఖ్యలో పశువులను కబేళాలకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

- జిల్లా నుంచి జోరుగా పశువుల అక్రమ రవాణా
- గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలింపు
- కిక్కిరిసి ఎక్కిస్తుండడంతో ఊపిరాడక చనిపోతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. యేటా వేలాది పాడి పశువులు, వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులు హైదరాబాద్‌లోని కబేళాలకు తరలుతున్నాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి యేటా పెద్ద ఎత్తున మూగజీవాలు కబేళాలకు తరతున్నట్లు చెబుతున్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పశువుల వ్యాపారులు జిల్లాకు చెందిన స్మగ్లర్లతో చేతులు కలిపి దొడ్డి దారిన వాహనదాల్లో పశువులను అర్ధరాత్రి సరిహద్దులు దాటించేస్తున్నారు.

● పశు సంతల నుంచే..

జిల్లాలో కౌటాల, జైనూరు, వాంకిడి మండలం గణేశ్‌పూర్, రెబ్బెన ప్రాంతాల్లో ప్రతి వారం పశు వుల సంతలు జరుగుతుంటాయి. ఇక్కడే కాకుండా పక్కనే ఉన్న మహారాష్ట్రలో, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున ఆవులు, దూడలు, వ్యవసాయానికి పనికొ చ్చే ఎద్దులను హైదరాబాద్ నగరానికి తరలిస్తున్నట్లు చెబుతున్నారు. సంతల్లో రైతుల నుంచి ఒక్కో పశువుకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ముట్టజెప్పి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో చాలా వరకు ఆవులు, లేగదూడల కొనుగోళ్లు అధికంగా జరుగుతున్నాయి. అదే సమయంలో వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులను కూడా అక్రమార్కులు రూ.5 వేల నుంచి రూ.15 వేల మధ్య చెల్లించి కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. పశువుల సంతల్లో స్మగ్లర్లు నేరుగా కొనుగోలు చేయడం లేదు. బ్రోకర్ల ద్వారా వ్యవసాయం, పాడి అవసరాల కోసం కొనుగోలు చేస్తున్నట్లు రైతులను నమ్మించి తీసుకుంటున్నట్లు ఇటీవల అధికారుల విచారణలో తేలింది. స్మగ్లర్లు పశువుల రవాణాకు ఆటంకం ఏర్పడకుండా కొంతమందిని ఎస్కార్ట్‌గా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దారి పొడవున పశువుల రవాణాను అడ్డుకునే అధికారులు, పోలీసు లకు వేలల్లో మామూళ్లు ముట్టజెప్పి కబేళాలకు చేరవేస్తున్నట్లు చెబుతున్నారు.

● చూసీచూడనట్లు..

పశువుల అక్రమ రవాణా భారీ ఎత్తున జరగడానికి ప్రధానంగా సంబధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీసగఢ్‌ల్లో నిర్వహిస్తున్న పశువుల సంతల్లో స్మగ్లర్లు, బ్రోకర్ల సహాయంతో వ్యవసాయ అవసరాల పేరిట పశువులను కొనుగోలు చేస్తున్నారు. సంతల్లో ఇచ్చే రసీదుల సహాయంతో వాహనాల్లో రవాణా చేస్తున్నారు. జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దు మండలాలైన వాంకి డి, సిర్పూర్(టి), చింతలమానేపల్లి మండలాల నుంచి నిత్యం ఈ అక్రమ రవాణా జరుగుతోంది. అధికారు లకు మామూళ్లు ముట్టచెబుతుండడతో చూసీచూ డనట్లు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఫిర్యాదులు వస్తేనే అధికారులు వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

● చనిపోతున్న పశువులు..

అక్రమంగా రవాణా చేస్తున్న ఆవులు, దూడలు, ఎద్దులను స్మగ్లర్లు వాహనాలలో పరిమితికి మించి కుక్కి తీసుకెళ్తుండడంతో ఊపిరాడక చాలా పశువులు మార్గ మధ్యలోనే మృతి చెందుతున్నాయి. ఇటీవల మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వ్యాన్‌లో 20కి పైగా ఆవులను తరలిస్తుండగా అందులో పన్నెండు పశువులు మృత్యువాత పడ్డాయి. జిల్లాలో తరుచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయి. గతంలో కాగజ్‌నగర్ మీదుగా అక్రమంగా పశు వులను తరలిస్తుండగా అందులో కొన్ని పశువులు ఊపిరాడక మృత్యువాత పడ్డాయి. స్మగ్లరు మృతి చెం దిన పశువులను పెద్దవాగు సమీపంలో పడేసి వెళ్లిపో యారు. ఇటీవల పెంచికల్‌పేట, దహెగాం మండలాల మీదుగా అక్రమంగా తర లిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించారు. ఈ మేరకు అక్రమంగా పశువు లను రవాణ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

- ఖాండ్రే విశాల్, బీజేపీ నాయకుడు



పశువుల అక్రమ రవాణ చేస్తున్న వారిపై అధికారు లు కఠిన చర్యలు తీసుకోవాలి. నిత్యం జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల నుంచి వాహనాల్లో పరిమితికి మించి పశువులను అక్రమంగా తరలిస్తున్నారు. పలు సందర్భాల్లో పశువుల అక్రమ రవాణాపై పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

ఇంటర్వ్యూ

Interview

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం



- ప్రత్యేక ప్రణాళికతో ముందుకు
- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కళ్యాణి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక ప్రణాళికను పక్కాగా అమలు చేస్తన్నామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కళ్యాణి అన్నారు. బుధ వారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరించారు.

ఆంధ్రజ్యోతి: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారు.?

డీఐఈవో: ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల షెడ్యూల్ ఖరారు చేసి విడుదల చేసింది. దీనికి కనుగుణంగా విద్యార్థులను పరీక్షల కోసం సిద్ధం చేస్తున్నాం. మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు జరుగనునున్నాయి.

ఆంధ్రజ్యోతి: మార్చిలో నిర్వహించే పరీక్ష ఫలితాలపై మీ అంచనాలేమిటీ?

డీఐఈవో: కుమరం భీం జిల్లా 2023లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. 2024లోఫలితాల శాతం తగ్గి ఏడవ స్థానానికి పడిపోయింది. 2025లో గతంతో పోలిస్తే ఫలితాల శాతాన్ని పెంచడానికి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రత్యేక ప్రణాళికపై కార్యాచరణ ఎలా నిర్ణయించారు?

డీఐఈవో: 90 రోజుల ప్రణాళిక పేరుతో బోర్డు ఇచ్చిన ఆదేశాల మేరకు కార్యాచరణ రూపొందించాం. ప్రభుత్వ కళాశాలల్లో అయా సబె క్టుల అధ్యాప కుల నుంచి విద్యార్థుల స్థితిగతులతో పాటు సిలబస్, ఇతర అంశాలపై సమాచారం సేకరించాం. రానున్న 90 రోజుల్లో రోజు వారిగా చేసే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

ఆంధ్రజ్యోతి: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎందరు ఉన్నారు.?

డీఐఈవో: జిల్లాలో మొత్తం 16 కళాశాలలు ఉన్నాయి. వీటిలో 11 ప్రభుత్వ కళా శాలలు, 5 ప్రైవేటు కళాశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 2,149, ప్రైవేటులో 970 మంది విద్యా ర్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 2,519 ప్రైవేటులో 1,015 మంది ఉన్నారు.

వణికిస్తున్న చలి



తిర్యాణిలో అలుముకున్న పొగమంచు

జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు. బుధవారం సిర్పూర్(యు)లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తిర్యాణిలో పొగ మంచుతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. - ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగు లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ లను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లో పద్మశాలి భవన్‌లో బుధవారం నిర్వహించిన మహా సభలో ఆయన మాట్లాడారు. మహాసభల సందర్భంగా సంఘ జెండాను ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రావడానికి మాత్రమే కాదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు విషయాన్ని పట్టించుకోక పోవడం సరికాదన్నారు. పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. అలాగే తెలంగాణ రెండో పీఆర్సీ నివేదిక తెప్పించి, మెరుగైనా ఫిట్‌మెంట్ జూలై 2023 నుంచి అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లోని పండిత్, పీఈటీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చే యాలని కోరారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. వీటితో పాటు మధ్యాహ్న భోజన ధరలను కూడా పెంచాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై భవిష్యత్తులో పోరాడేం దుకు తీర్మానం చేశారు. ఈ మహాసభలో ఎంఈవో ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు చక్రపాణి, జిల్లా అధ్యక్షు రాలు వైద్య శాంతకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, హేమంత్, ప్రీతి, రమేశ్, ఊశన్న, రాజ్‌కమలాకర్‌రెడ్డి, దుర్గయ్య, మీనా పాల్గొన్నారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి సీఎం కప్ 2024 పోటీల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. స్థానిక గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బుధవారం నిర్వహించిన వాలీబాల్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. అంతకు ముందు క్రీడా జ్యోతి వెలిగించి క్రీడా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గిరిజన క్రీడాధికారి మీనారెడ్డి, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్ నిర్మాణ స్థలం పరిశీలన

బెజ్జూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే ఆరోగ్య ఉపకేంద్రం స్థలాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి సీతారాం పరిశీలించారు. గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం భవనం పను లు ప్రారంభం కాకపోవడంతో దీనిపై అధికారులను, గ్రామస్థు లను అ డిగి తెలుసుకున్నారు. భవనం నిర్మించే స్థలాన్ని రెవెన్యూ అధికారులు అప్పగించని కారణంగా పనులు ప్రారంభం కాలేదని సంబంధిత కాం ట్రాక్టర్ చెప్పాడు. స్థలం కోసం తహసీల్దార్‌తో మాట్లాడి భవనం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డాక్టర్ హజీమ్, హెచ్‌ఈవో కోటేష్, తదితరులు ఉన్నారు.

కౌటాల: వైద్య సిబ్బంది విధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎం హెచ్‌వో సీతారాం నాయక్ తెలిపారు. కౌటాల పీహెచ్‌సీ, బోదంపల్లి స బ్ సెంటర్‌ను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

కాగజ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ఎస్పీఎం యాజమాన్యం చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయ మని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. ఎస్పీఎం యాజ మాన్యం సమకూర్చిన మూడు చక్రాల బ్యాటరీ బళ్లను బుధవారం దివ్యాంగులకు సబ్ కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడారు. ఎస్పీఎం యాజమాన్యం సామాజిక కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు. ఎస్పీఎం యూనిట్ హెడ్ ఏకే మిశ్రా మాట్లాడుతూ ఎస్పీఎం కార్మికుల సంక్షేమంతో పాటు సామాజిక సేవలు కూడా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం.ఎస్.గిరి, మేనేజర్ శశి కాంత్, నాగరాజు, తుమ్మ రమేశ్ పాల్గొన్నారు. కాగా కాగజ్‌నగర్ పట్ట ణంలోని పలు వార్డుకు చెందిన దివ్యాంగులకు ఆసరా పెన్షన్ అందడం లేదని పలువురు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కాగజ్‌న గర్ పట్టణంలో పలు సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు నాయకులు బాల్కశ్యాం, శివ వినతి పత్రం అందజేశారు.

జనజీవన స్రవంతిలో కలువాలి

పెంచికల్‌పేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు వనా లను వదిలి జనజీవన స్రవంతిలోకి రావాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రా మనుజం అన్నారు. బుధవారం మండలంలోని అగర్‌గూడ గ్రామంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు 'పోరుకన్న ఊరు మిన్న' కార్యక్రమంలో భాగంగా మావోయిస్టు చౌదరి అంకుబాయి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు,, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై కొమురయ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వీపర్ల వేతనాలు పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో 25 ఏళ్లుగా పని చేస్తున్న తమకు రూ. 15,600కు పెంచాలని బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాధికారి సదానంద్‌కు స్వీపర్లు వినతిపత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వీప ర్లు సయ్యద్ సలీం, రామయ్య, అశోక్, రాజారాం, సురేష్, ప్రేంసాగర్, బుచ్చన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

సిర్పూరు(టి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు సామాజిక ఆసుపత్రి పరిధిలోని లోన్‌వెల్లి, ఆయా సబ్ సెంటర్లలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సిర్పూరు(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ఇన్, పేషెంట్ల జాబితా, ఆసుపత్రి పని తీరుతో పాటు మందుల నిల్వలు, రోగులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేంపల్లి ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు గణితం బోధించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఆసుపత్రి వైద్యురాలు అనూష ఉన్నారు.



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

రెబ్బెన, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న తెలిపారు. బుధవారం గోలేటి సివిల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించటం లేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్లేకార్డ్స్‌తో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బండారి తిరుపతి, కార్మికులు ఆశోక్, తిరుపతి, గోలేటి శ్రీను, అరికిల్ల పోచం, భీమేష్, లింగయ్య, సావిత్రి, శంకరమ్మ, తార, మల్లేశ్వరి, కమల, విజయ, లలిత, సునిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సిర్పూరు(టి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిర్పూరు(టి) మండలంలోని బెంగాలీ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి వేగవంతం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏడాదిలోపే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వచ్చే ఏడాది మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి వస్తాయన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పత్తికి గిట్టుబాటు ధర కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫైసల్ బీన్ సులేమాన్, సిర్పూరు(టి) కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి, మాజీ జడ్పీటీసీ అజ్మీర రాంనాయక్, సమీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం ఎస్ఎస్ఏ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె దీక్షను ఆయన సందర్శించి మద్దతు పలికారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగులు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఎస్ఎస్ఏ దీక్ష శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి ఎంఈఓలు సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు మోహన్, నాగసుధ, తుకారాం, నగేష్, సంతోష్, అన్నపూర్ణ, చైతన్య, అరుణ, రమాదేవి, నలంద తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలను సందర్శించిన విద్యార్థులు

పెంచికలపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంబాయిగూడ ప్రాథమిక పాఠశాలలోని 4వ, 5వ తరగతి విద్యార్థులు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, పీహెచ్‌సీ, పోలీసుస్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే కార్య కలాపాలను విద్యార్థులకు అధికారులు వివరించారు. విద్యార్థి నుంచే తెలుసుకోవడం వల్ల వారి అవగాహన ఏర్పడుతుందని తెలిపారు., కార్యక్ర మంలో ఉపాధ్యాయుడు జాఫర్, సామాజిక కార్యకర్త ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

గర్మిళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో ఈ నెల 20న జూనియర్ బాల బాలికల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో రాజ్‌వీరు, జిల్లా సంఘం సెక్రటరీ కనపర్తి రమేష్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 10 గంటలలోగా రావాలని సూచించారు. వివరాల కోసం 9866395859లో సంప్రదించాలన్నారు.

యాదవ కుల సంఘ కార్యవర్గం

భీమారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమారంలో బుధవారం మండల యాదవ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోల కిష్టయ్య యాదవ్, గౌర వాధ్యక్షుడిగా తువ్వ తిరుపతియాదవ్, ఉపాధ్యక్షులుగా కొమ్ము విజయరాజు యాదవ్, పున్నంయాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాపల్లి రాజన్న యాదవ్, కోశాధికారులుగా దారవేణి తిరుపతియాదవ్, కొమ్ము కుమార్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మందమర్రిరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిర్రకుంట గ్రామంలో బుధ వారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రాం చందర్, కొమురయ్య మాట్లాడుతూ సర్వేకు పేదలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు కొత్త హంగులు

- నేడు ప్రత్యేక కార్యక్రమాలు





కౌటాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దారు. వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. సొంత ఖర్చులతో ఈ పనులు చేయడం విశేషం. ఈ పాఠశాలకు ముందు గేటు, స్టేజీ, మరుగుదొడ్డు, తరగతి గదుల గోడలు, ప్రహరీకి రంగులు వేశారు. విద్యార్థులకు చదువుకునేందుకు కుర్చీలు, బెంచీలు, నోట్ బుక్‌లు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గురువారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో పాటు ఇతర శాఖల అధికారులు హాజరవుతున్నట్లు కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు తెలిపారు.

క్రైం కార్నర్

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్ట్

దండేపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తమామిడిపల్లి గ్రామానికి చెందిన నలిమెల సుధాకర్(సుధీర్) అనే యువకుడు ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కల్పించినందుకు అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఈనెల 14న శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శనకు వచ్చిన మండల వ్యవసాయ శాఖఅధికారి గొర్ల అంజిత్‌కుమార్ రైతులతో మాట్లాడుతుండగా అక్కడే ఉన్న సుధీర్ మధ్యలో కలుగజేసుకొని దూషిస్తూ చంపుతానని బెదిరించాడన్నారు. వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

భీమిని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో బుధవారం అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మంచిర్యాలలో ఇంటర్ చదువుతున్న ఒగ్గు అంజన్నకు బస్‌లో పరిచయమైన వ్యక్తి ద్వారా గంజాయి విత్తనాలను తీసుకొన్నాడు. అనంతరం దుబ్బగూడెంలో ఆకుల హరీష్ ఇంటి పెరట్లో రెండు మొక్కలు సాగు చేశారు. రెండు నెలల తరువాత సాగు చేసిన గంజాయి అమ్మడానికి అంజన్న, హరీష్ వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 240 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గంజాయి సాగు, విక్రయాలు చేపడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెల్లంపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్నాల బస్తీలో ఏలూరి రవి ఇంట్లో పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను బుధవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ లచ్చన్నలు తెలిపారు. వారు మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా పేకాట ఆడుతున్న ఏలూరి రవి, గడికొప్పుల భీమయ్య, ఎంఏ నబీ, ఆరేపల్లి పోశం, దాగం చరణ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 10,610 నగదు స్వాధీనం చేసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన ఒకరికి ఏడాది జైలుశిక్ష

ఆసిఫాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణానికి కారణమైన కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అనంతలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. రెబ్బెన సీఐ బుద్దిస్వామి తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ పట్టణం బజారువాడికి చెందిన పడిగెల విజయ్‌కుమార్ సెప్టెంబరు 30, 2019న తన భార్య అరుణను హైదరాబాద్ వెళ్లేందుకు కాగజ్‌నగర్‌లో ట్రైన్ ఎక్కించేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఖైర్‌గాం సమీపంలో అదే గ్రామానికి చెందిన మానేం విజయ్ అనే వ్యక్తి కారుతో ఢీకొట్టడంతో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. సాక్ష్యులను విచారించిన అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో విజయ్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఆయన తెలిపారు.

కుల బహిష్కరణ కేసులో ఎనిమిది మందికి జైలు

వాంకిడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంలో కుల బహిష్కరణ చేసిన వాంకిడి మండల కేంద్రానికి చెందిన కుల పెద్దలు ఎనిమిది మందికి ఒక నెల జైలు శిక్ష, రూ. 500 చొప్పున జరిమానా విధిస్తూ స్పెషల్ పీసీ ఆర్ కోర్ట్ ఆదిలాబాద్ న్యాయమూర్తి టి దుర్గా రాణి బుధవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలకేంద్రంలోని రాంనగర్‌కు చెందిన నౌగడే ఆత్మారాం కుమారుడు సుభాష్‌ను భూతగాదా విషయంలో నాలుగు సంవత్సరాల పాటు కుల బహిష్కరణ చేస్తూ కుల పెద్దలు నౌగడే దాదాజీ, బాబురావు, బాహుజీ, చాప్లే సీతారాం, చౌదరి బిజ్జు, నౌగడే రమేష్, పెంటు, లోనారె నాందేవ్ తీర్మానించారు. దీనికిగాను నౌగడే ఆత్మారామ్ తేదీ 08-05-2020 రోజున వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌హెచ్‌వో డి రమేశ్ ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. పీపీ నవీన్ సాక్ష్యులను కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి విచారణ జరిపి నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితులకు ఒక నెల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత డీఎస్పీ కరుణకర్, సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, కోర్టు లైజనింగ్ అధికారి ఈశ్వర్ సింగ్‌ను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సిర్పూర్(యు), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూర్నూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలో గల భూర్నూర్(కే)లో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ఇల్లు కాలిపోయినట్లు బాధితుడు పుర్క సందీప్ తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు పంచనామా నిర్వహించారు. సుమారు 47 వేల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు హన్మంత్‌రావు, ఆత్రం వినాయక్‌రావు, అవికాష్ పాల్గొన్నారు.

లారీ బోల్తా

మందమర్రిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేడారం సమీపంలో గల జాతీయ రహదారిపై బుధవారం రాత్రి బొగ్గు లోడు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. చంద్రపూర్ నుంచి బొగ్గు లోడుతో పాల్వంచకు వెళ్తున్న లారీ (టీజీ19టీ0459) వేగంగా వచ్చి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని లారీని పక్కకు తొలగించారు. డ్రైవర్‌కు, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

నేరాల నియంత్రణకు సహకరించాలి


ఆదివాసీలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

సిర్పూర్(యు), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు వ్యసనాలకు దూరంగా ఉండి నేరాల నియంత్రణకు సహకరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని పవర్‌గూడలో బుధవారం ఆదివాసీ వృద్ధులు, ప్రజలకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు ఆయన అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. విద్యతోనే అన్ని రంగాల అభివృద్ధి ముడిపడి ఉందని చెప్పారు. ఉన్నత చదువులు చదివి లక్ష్యం చేరుకోవాలన్నారు. గంజాయి ఎవరు సాగు చేయకూడదని సూచించారు. సాగు చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, డీఎస్పీ కరుణకర్, జైనూర్ సీఐ రమేష్, ఎస్సైలు రామారావు, రామకృష్ణారావు, నాయకులు నాగోరావు, వెంకట్‌రావు, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

- పూత, కాత దశలో పంట
- మండలంలో 4 వేల ఎకరాల్లో సాగు
- రైతులను భయపెడుతున్న పురుగు ఉధృతి

చింతలమానేపల్లి మండలంలో రైతులు కంది పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కురిసిన వానలను తట్టుకొని పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది.



కంది ఆశాజనకం

చింతలమానేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రైతులు కంది పంటను సాగు చేస్తున్నారు. అధికంగా పత్తి పంటను సాగు చేస్తుండగా, తర్వాత స్థానంలో వరి, కంది పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కంది పంట ప్రస్తుతం పూత, కాత దశలో ఉండడంతో రైతులు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. చింతల మానేపల్లి మండలంలో సుమారుగా 4వేల ఎకరాల్లో కంది పంట సాగవుతోందని అధికారులు చెబుతున్నారు.

అంతర్ పంటగా..

రైతులు చాలా మంది పత్తి పంట వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో కొంత మంది రైతులు మాత్రమే పత్తి పంటలో అంతర్ పంటగా కంది సాగు చేశారు. ఇటీవల మబ్బులు, అకాల వర్షాల కారణంగా కొంతమేర రైతులు కంది పంటపై ఆశలు సన్న గిల్లుతున్నట్లు చెప్పినా ప్రస్తుతం ఆశాజనకంగా ఉండ డంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో కంది పంట తమకు మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు.

పెరిగిన మద్దతు ధర..

ప్రభుత్వం ఈ ఏడాది కంకిఇ మద్దతు ధర పెంచింది. గత ఏడాది ధర క్వింటా లుకు రూ. 6,300 మాత్రమే ఉంది. కాగా ఈ ఏడాది రూ. 7,500గా ప్రకటించింది. పత్తి కంటే కందికే ఎక్కువ ధర ఉంది. కాగా పంట వచ్చే సమయానికి అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తేనే మద్దతు ధర పొందే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

పచ్చ పురుగు బెడద..

కంది పంట పూత, కాత దశలో ఉండడంతో పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆకులను గూళ్లుగా కట్టుకొని పంటపై దాడి చేస్తుం టాయి. దీనికి తోడు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో చీడపీడల బెడద పెరిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంట రక్షణకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి వ్యవసాయ అధికారుల జాడ కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో కంది పంట సంరక్షణ చర్యల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పరిశీలించి సూచనలు ఇస్తే దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ దిశగా ఆటవీశాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించి అనుమతులు పొందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈజీఎస్‌లో సీసీ రోడ్లు, మురికి కాలువల చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారిసున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో నెట్‌వర్క్ సేవలను మెరుగు పరిచేందుకు మొబైల్ టవర్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాలను పరిష్కరించేందుకు జాయింట్ సర్వే నిర్వహించనున్నామని, పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. పోడు భూముల్లో పంటలు సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులకు పట్టాలు అందించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీఆర్‌డీవో దత్తరాం, డీపీవో భిక్షపతి, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ రాజేశ్వర్‌జోషి, పీఆర్‌ఈఈ ప్రభాకర్, ఆదివాసీ నాయకులు, సర్‌మేడి, పటేళ్లు తదితరులు పాల్గొన్నారు.

- సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందిగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

రెబ్బెన, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో బుధవారం ప్రజారగ్ జోల్ యాత్ర కర పత్రాలను బంజార సేవా లాల్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సేవా లాల్ సేనా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జి రవినాయక్ మాట్లాడుతూ రామరావు మహారాజ్ దివ్య ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్రలో బంజారాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బా నాయక్, రాజునాయక్, సుబ్బారావు, తిరుపతి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆసిఫాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యారిని అర్చన ఎస్‌జీఎఫ్ అండర్-17 నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో రాణించడంతో బుధవారం పలువురు అభినందించారు. ఈనెల 10 నుంచి 14 వరకు పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో గోల్ అటకార్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేశం, పీడీ తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

వాంకిడి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా అర్జుగుడ, బెండార, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బుధవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయా పాఠశాలల ఉపాధ్యాయులు ధర్మాబాయి, శ్రీనివాస్, జగదీష్, సంతోష్, శ్రీనివాస్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూరు(టి)-మాకొడి రైల్వే ట్రాక్ మధ్య పులి సంచారం

సిర్పూరు(టి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి)-మాకోడి రైల్వే ట్రాక్ మధ్యలో బుధవారం సాయంత్రం పులి సంచరించిందని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తయ్యారు. ఈ విషయమై సిర్పూరు(టి) ఎఫ్‌ఆర్‌వో ఎక్బాల్ హుస్సేన్‌ను వివరణ కోరగా మాకోడి ప్రాంతం మహారాష్ట్ర పరిధిలోకి వస్తుదని చెప్పారు. తాము పులి సంచారంపై నిఘా పెడుతామని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

కాగజ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో వివిధ వార్డులకు చెందిన ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి గుర్తించి బుధవారం పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై డీకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గును అందజేయాలి


మాట్లాడుతున్న ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ

శ్రీరాంపూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసి వినియోగదారులకు అందించాలని శ్రీరాంపూర్ ఎస్‌ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ అన్నారు. ఆర్‌కే 7 గనిపై నిర్వహించిన మల్టిడిపార్ట్‌మెంటల్ సమావేశానికి కన్వీనర్ హోదాలో ఆయన హాజరై మాట్లాడారు. ఆర్‌కే 7 రక్షణ, ఉత్పత్తి విషయాల్లో ముందంజలో ఉందని, ఎస్‌డీఎల్ యంత్రాలు, మ్యాన్‌రైడింగ్ ఇదే గనిలో మొదటిసారి ప్రారంభమయ్యాయనిఇ గుర్తు చేశారు. 2005లో పర్యావరణ అవార్డు, 2008, 2009లో రక్షణ అవార్డులు సాధించడం అభినందనీ యమన్నారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. అనంతరం సంస్థ స్థితిగతులు, సదుపాయాలు, విధులు, ఉత్పత్తి, రక్షణ, యంత్రాలు, తదితర విషయాలపై ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీజీఎం(ఈఅండ్‌ఎం) కెవి రామకృష్ణారావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, క్వాలిటీ ఇన్‌చార్జి కె. వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి సంతోష్, పిట్ కార్యదర్శి సారయ్య, సంక్షేమాధికారి శంతన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వెల్ బేబీ షో

మందమర్రి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం మందమర్రి కేకే 1 డిస్పెన్సరీలో శుక్రవారం ఐదు సంవత్సరాల పిల్లలకు వెల్ బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. సింగరేణి డే సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆరు క్యాటగిరీల్లో బహుమతులు అందజేయనున్నారు

గోలేటిలో 21న..

రెబ్బెన, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరిలో శనివారం వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగికి సంబంధించి నాలుగేళ్లలోపు చిన్నారులు పాల్గొనాలని సూచించారు. ఇందుకు ఉద్యోగి గుర్తింపు కార్డు ఆసుపత్రి బుక్, బేబీ పుట్టిన ధ్రువీకరణ పత్రం, బేబీ ఇమ్యూనైజేషన్ కార్డుతో తప్పకుండా రావాలని ఆయన కోరారు.

బకాయిలను వెంటనే ఇప్పించాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి బకాయిలను వెంటనే ఇప్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఎస్‌ఆర్‌పీ 1 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి 30 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందన్నారు. ఈ విషయంలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో సొంతిల్లు, ఆదాయపు పన్ను మాఫీ సీబీఎస్‌ఈ సిలబస్, తదితర అంశాలపై హామీలు ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు వాటిని నెరవేర్చేవిధంగా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికులు డిమాండ్లు నెరవేర్చేలా తమ యూనియన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టామని, కార్మికులు ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, కోశాధికారి చంద్రశేఖర్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, గోపాల్ రాథోడ్, నాంపల్లి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

రెబ్బెన, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోలేటి సీహెచ్‌పీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడిగా పిశ్రావణ్‌కుమార్, బాలయ్య, అధ్యక్షుడిగా గోలేం గట్టయ్య, అడ్వాయిజర్లుగా సంపత్, సంతోష్, ఈశ్వర్, రామయ్య, జనరల్ సెక్రటరీగా రమేశ్, ట్రేజరర్‌గా విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, శ్యాంబాబు ఎన్నికయ్యారు.

సింగరేణి సూపర్‌బజార్‌ను వెంటనే ప్రారంభించాలి


మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకుడు మణిరాంసింగ్

బెల్లంపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి సూపర్ బజార్‌ను వెంటనే ప్రారంభించాలని టీఎన్‌టీయూసీ నాయకుడు మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సింగరేణి సూపర్ బజార్ వద్ద విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం కార్మిక కుటుంబాలకు, పట్టణప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను అందించేందుకు సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లిలో సింగరేణి సూపర్ బజార్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కొంత కాలం నడిచిన తర్వాత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సూపర్ బజార్‌నుమూసివేయడం జరిగిందన్నారు. సింగరేణిలో గెలిచిన కార్మిక గుర్తింపు సంఘం మొద్దునిద్రవీడి సూపర్ బజార్‌ను తెరిపించాలని, ఇందుకోసం సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తేవాలన్నారు. లేకపోతే జీఎం కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో టీఎస్‌టీయూసీ నాయకులు గద్దల నారాయణ, మల్లయ్య, తిరుపతి, వంశీ, చంద్ర మౌళి, పాండే తదితరులు పాల్గొన్నారు.



హైపవర్ వేతనాలు చెల్లించాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి అధ్యక్ష కార్యదర్శులు తాళ్లపెల్లి శ్రీనివాస్, ఎండి జాఫర్‌లు పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మీద కార్మికులు ఎంతో ఆశలు పెట్టుకున్నారని, వీరి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కనకయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని ఏరియా జీఎం. సూర్యనారాయణ అన్నారు. అన్ని విభాగాల అధికారులతో బుధవారం ఆయన జీఎం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23న ప్రగతి స్టేడియంలో నిర్వహించే వేడుకలకు వచ్చే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఉదయం 9.30 గంటలకు జీఎం కార్యాలయంలో, 11 గంటలకు ప్రగతి మైదానంలో జెండావిష్కరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, రవీందర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి

మందమర్రిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణిదేవేందర్ పోటీలను ప్రారంభించారు. ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను దృష్టిలో ఉంచుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గెలుపొందిన వారికి అదే రోజున బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమమలో పీఎం శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, మహిళలు పాల్గొన్నారు.

ఎంవీటీసీ తనిఖీ

రెబ్బెన, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి గోలేటిలోని రక్షణ తనిఖీ బృంద కన్వీనర్ కొత్తగూడెం జీఎం జీవి కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఎంవీటీసీని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చక్కటి ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, అధికారులు జి.సంబంధం, వీఎస్ ఇందా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్టల నిర్మాణానికి సర్వే ప్రారంభం

5వ పేజీ తరువాయి

గోదావరికి కరకట్ట లేనట్లేనా...!

గోదావరి తీరం వెంట కూడా కరకట్ట నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ భారీగా నిధులు అవసరం ఉండటంతో ప్రస్తుతానికి ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలుస్తోంది. నదికి కరకట్ట నిర్మించాలంటే పెద్ద మొత్తంలో భూ సేకరణ అవసరం కాగా, పరిహారం కింద సుమారు రూ. వంద కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. దీంతో ప్రస్తుతానికి రాళ్ల వాగు గోడల నిర్మాణానికే పరిమితమయ్యారు. రాళ్లవాగు కరకట్టల నిర్మాణానికి సంబంధించి సర్వే పూర్తయిన తరువాత త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. సర్వేలో ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాము, డివిజనల్ ఇంజినీర్ కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ హరికృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, భూ రికార్డులు, సర్వే ఏడీ శ్రీనివాస్, మంచిర్యాల సర్వేయర్ మంజుల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్‌లు పాల్గొన్నారు.

దళిత హక్కుల సాధనకు తరలిరండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నస్పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితవర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో కల్పించిన హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండో జాతీయ మహాసభ జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతుందన్నారు. మహాసభలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మహాసభలకు పోస్టర్లను విడుదల చేశారు. డీహెచ్‌పీఎస్ నాయకులు గునిగంటి నర్సింగరావు, నక్క వెంకట స్వామి, పొనగంటి యోసేపు, మెరుపల్లి రవి, జిపి రావు, వెల్పుల తిరుపతి, ఇలుకూరి కళ్యాణ్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్‌లో విద్యార్థుల పర్యటన



జన్నారం, డిసెంబర్ 18(ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ అభయారణ్యం జన్నారం డివిజన్‌లోని పైడిపల్లి, గోండుగూడ, భర్తన్‌పేట్, మైసమ్మకుంట, పలు ప్రాంతాల్లో బుధవారం జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆరు నుంచి పది తరగతి విద్యార్థులు అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఎఫ్ఆర్‌వో సుష్మారావు అడవుల సంరక్షణ, వన్యప్రాణులతో పాటు వృక్షజాతులపై వివరించారు. అధికారులు లాలుబాయ్, సాగరిక, రహీమోద్దీన్, పాల్గొన్నారు.

అటు విధులు.. ఇటు ప్రదర్శనలు

- సింగరేణిలో రెండున్నర దశాబ్దాల క్రితం కమ్యూనికేషన్ సెల్ ఏర్పాటు
- రక్షణ, ఉత్పత్తిపై కళా ప్రదర్శనలు



సింగరేణిడేలో కమ్యునికేషన్ సెల్ కళాకారుల ప్రదర్శన

మందమర్రి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారు ముందు నుంచి కళాకారులు... సింగరేణిలో ఉద్యోగం చేస్తూ తమ కళను ప్రదర్శిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు ప్రదర్శనల ద్వారా తెలియజేసేందుకు కమ్యూనికేషన్ సెల్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో పలువురు కళాకారులకు అవకాశం కల్పించింది. కళాకారులు రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదక రంగాలపై ప్రదర్శనలు ఇస్తున్నారు. వీరు ఇస్తున్న ప్రదర్శనలకు కార్మికుల్లో ఆదరణ లభిస్తోంది. రోడ్డు ప్రమాదాలు, గనులు, డిపార్టుమెంట్లపై అజాగ్రత్త, నిర్లక్ష్యం, ఏమరపాటు వల్ల జరిగే ప్రమాదాలపై ప్రదర్శనలు కళ్లకు కట్టేలా చూపిస్తున్నారు. సింగరేణిలో రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసింది. ఎంతో మంది కళాకారులు ఇందులో రాణించారు.

అవార్డులు పొందిన కళాకారులు...

సింగరేణిలో కమ్యూనికేషన్ సెల్ కళాకారులు వారి నటన, పాటలు, ఆర్కెస్ట్రా ద్వారా అవార్డులు పొందారు. కోల్ ఇండియా స్థాయిలో కల్చరల్ మీట్‌లో పాల్గొని బహుమతులు సాధించారు. కమ్యునికేషన్ సెల్‌లో ఎవరు ఎలాంటి పాత్రలు చేయాలనేది నిర్ణయించుకుని ఆ పాత్రకు ప్రాణం పోస్తున్నారు. సింగరేణిలో యేటా డిసెంబర్ 23న జరిగే సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో వీరి నటన ఆకట్టుకుంటోంది.

యాజమాన్యం ప్రోత్సాహంతోనే..

:డేవిడ్ సన్, ఎలక్ట్రీషియన్



యాజమాన్యం ప్రోత్సాహంతోనే గుర్తింపు లభించింది. ఆర్కెస్ట్రాలో నిర్వహణ చేస్తుంటాను. యేటా సింగరేణిడేలో ప్రదర్శనలు ఇస్తున్నా. రక్షణ వారోత్సవాలలో కూడా పాటలకు తగ్గట్టు సంగీతం సమకూరుస్తా. కార్మికుడిగా, కళాకారుడిగా గుర్తింపు లభించడం, తోటి కార్మికుల ప్రోత్సాహం వల్లే సాధ్యమైంది. కోల్ ఇండియాలో కూడా బహుమతులు సాధించి సింగరేణి సత్తా చాటాం.

అనేక బహుమతులు సాధించాను..

ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, టెండాల్ వర్కుషాపు,

నటుడు, కాంగో ప్లేయర్



సింగరేణి ఉద్యోగంలో చేరక ముందు కాంగో వాయించేవాడిని. ఉద్యోగంలో చేరిన తర్వాత కమ్యూని కేషన్ సెల్‌లో గుర్తింపు లభించింది. సింగరేణి డేలో కాంగో వాయిస్తాను. నటన ద్వారా బహుమతులు సాధించాను. నటుడిగా, కాంగో ప్లేయర్ గా గుర్తింపు రావడానికి కార్మికులు, యాజమాన్యం ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది.

గాయకుడిగా గుర్తింపు..

:సాధనవేని ప్రభాకర్, ఎలక్ట్రిషియన్

ఉద్యోగంలో చేరక ముందు నటన కళా నిలయం ఏర్పాటు చేశా. పాటలు పాడే వాడిని, ఉద్యోగంలో చేరిన తర్వాత గాయకుడిగా గుర్తింపు పొందాను. సింగరేణికి సంబంధించి అన్ని కార్యక్రమాల్లో గీతాలు ఆలపిస్తాను. కల్చరల్ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాను. యాజమాన్యం ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది.



సింగరేణిలో ప్రత్యేక గుర్తింపు..

:హేమంత్‌కుమార్, ఎలక్ట్రిషియన్



సింగరేణిలో తబలిస్టుగా, గాయకుడిగా గుర్తింపు పొందాను. కల్చరల్ పోటీల్లో పాల్గొనడం, బహుమతు లు సాధించడం గర్వంగా ఉంది. రక్షణ వారోత్సవాలతో పాటు సింగరేణి డే, వివిధ కార్యక్రమాల్లో గీతాలాపన చేయడం, అందరి ప్రశంసలు పొందడం మరువలేనిది, తోటి ఉద్యోగులు, యాజమాన్యం ప్రోత్సాహంతో ఈ స్థాయికి చేరుకున్నాను.

కార్మికుల చప్పట్లే దీవెనలు..

:సుదర్శన్, జనరల్ మజ్దూర్, కాసిపేట



కార్మికుల ప్రోత్సాహం మరువలేనిది. సింగరేణిలో చేరిన తర్వాత నటుడిగా రక్షణ సూత్రాలపై ప్రదర్శనలు ఇచ్చాను. దీంతో తన నటనకు కార్మికులు ప్రోత్సహించారు. రెండు దశాబ్దాలుగా ప్రదర్శనలు చేస్తున్నా. తోటి ఉద్యోగులు, యాజమాన్యం అందిస్తున్న సహకారం మరువలేనిది. సింగరేణి కార్మికునిగా, కళాకారునిగా ఎక్కడికి వెళ్లినా అభినందిస్తారు.





జీఎం చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న కళాకారులు, నృత్య ప్రదర్శన

ఇంటర్వ్యూ

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

-బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ



ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండ తీసుకనే చర్యలు?

ఆర్డీవో: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశాం. ఎవరైనా ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలి.

ఆంధ్రజ్యోతి: తప్పుడు ధ్రువపత్రాలతో కబ్జా చేస్తున్న వారిపై చర్యలేవి?

ఆర్డీవో: కొందరు తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారనే విషయం దృష్టికి వచ్చింది. అధికారులతో విచారణ చేపట్టాం. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఎవరైనా భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి?

ఆర్డీవో: తహసీల్దార్‌లతోపాటు సిబ్బంది సమయ పాలన పాటించాలి. పాటించని వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మెమోలు అందజేస్తాం. తీరు మార్చుకోకపోతే శాఖపరమైన చర్యలు తప్పవు.

- బెల్లంపల్లి

నేడు హుండీ లెక్కింపు

దండేపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం హుండీలను లెక్కిస్తున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 17 నుంచి ఇప్పటి వరకు భక్తులు హుండీలో వేసిన కానుకలను ఆలయ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో లెక్కిస్తామన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

తాండూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదారం టౌన్‌షిప్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలతో నిర్మాణం చేయనున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో నందన్ కుమార్, టీఏ అరుణ్, రవీందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులను ఆదుకోవాలి

జన్నారం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని గల్ఫ్ కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వలస దినోత్సవం సందర్బంగా గల్ఫ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి యేటా 5 వందల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి నాయకులు ఎరుకల రాజు గౌడ్, మల్లేష్, మహ్మద్ అలీ, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు అందజేత

దండేపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెబ్బనపల్లి పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు రెండు జతల దుస్తులను ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు యేటా విద్యా సామగ్రి, దుస్తులు అందిస్తూ వారికి బాసటగా నిలుస్తూ సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎండి షరీఫొద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈజీఎస్ మండల కార్యవర్గం

మందమర్రిరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండల ఉపాధి హామీ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఉపాధిహామీ సంఘం మండల సలహాదారుడు ఈద లింగయ్య తెలిపారు. మండల అధ్యక్షుడిగా శెట్టి సత్యనారాయణ, గౌరవాధ్యక్షులుగా లింగాల రాజేందర్, క్యాషియర్‌గా భుక్య భూమా, కార్యదర్శిగా బోగె జ్యోతి, కమిటీ సభ్యులుగా రవికుమార్, దైనేని సత్యనారాయణ, దుర్గం రవికుమార్, బాపులను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెడిటేషన్‌తో మానసిక ఒత్తిడికి దూరం

దండేపల్లి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మెడిటేషన్‌తో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి దూరం చేసుకోవచ్చని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శోభ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ట్రెయినర్ పవన్ కుమార్, రామచంద్రా మిషెన్, శ్రీహరి, ఈశ్వరయ్యలు మెడిటేషన్, యోగాపై విద్యార్థులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ప్రశాంతతతో ఉన్నట్లైతే ఏకాగ్రత కుదిరి మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. ట్రెయినర్ ప్రవన్‌కుమార్ పవన్‌కుమార్ మాట్లాడుతూ యోగ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. రోజు యోగా చేయాలన్నారు.

21 రకాల పూలతో మహా పుష్పాభిషేకం

నస్పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మి గణపతి ఆలయంలో బుధవారం సంకట హర చతుర్థిని పురస్కరించుకుని స్వామివారికి 21 రకాల పూలతో (1008 కిలోలు) మహా పుష్పాభిషేకం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా తెప్పించిన 21 రకాలు, 10 క్వింటాళ్ళ పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు ఆలయంకు చేరుకుని ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి పంచామృత అభిషేకం, పుష్పాలంకారణ, గణపతి హోమం ఆలయ ప్రధానార్చకులు గంగారపు వంశీ కృష్ణ శర్మ, రాంమూర్తి శర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు తెలిపారు. అయ్యప్ప స్వాములకు అల్పాహారం, భక్తులకు అన్నదానం నిర్వహించారు.



స్వామి వారికి పుష్పాభిషేకం చేస్తున్న పూజారులు, పాల్గొన్న అయ్యప్ప స్వాములు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రికెట్ విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న సీఐ, నాయకులు

తాండూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు యువతకు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని సీఐ కుమార స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాదారం గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల బహుమతుల ప్రధాన కార్యక్రమంలో మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజ మని, ఓడిన వారు మరల గెలుపొందడానికి ప్రయత్నించాలన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకోని మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తాండూర్ ప్రైమరీ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిసాయి. చివరి రోజు సీఎస్‌కే, కేఎక్స్‌ఎల్‌పీ జట్లు ఫైనల్‌కు చేరుకోగా సీఎస్‌కే జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ. 30 వేలు, ద్వితీయ జట్టుకు రూ.15 వేలను సీఐ చేతుల మీదుగా అందజేశారు. టీపీసీసీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య, నాయకులు సూరం రవీందర్ రెడ్డి, ఎలుక రాంచందర్, శేషగిరి, మైదం అనిల్, అలీం ఖాన్, మాసాడి శశి, వెంకటస్వామి, శివ, సల్మాన్, వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

కడెం ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకుంటాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్

జన్నారం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : కడెం ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీటి విడుదలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు యాసంగి పంటకు నీరు విడుదల చేస్తామని ప్రకటించారని, ప్రభుత్వం స్పష్టతతో ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలని ఏదో రకంగా ఇబ్బందులకు గురి చేయాలని మాట్లాడుతున్నారన్నారు. ప్రాజెక్టుకు రూ.9.40 కోట్లతో మరమ్మతు చేయించిన సంగతిని మర్చిపోవద్దన్నారు. నాయకులు పసివుల్లా, సయ్యద్ ఇస్మాక్, రాజశేఖర్, మేకల మాణిక్యం, సుధాకర్ నాయక్, రియాజోద్దీన్, ముత్యం సతీష్, కామన్‌పల్లి ఇందయ్య లక్ష్మి పాల్గొన్నారు.

యాదవుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న యాదవుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచిర్యాల అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. యాదవులు ఎదుర్కొంటున్న గొర్రెల యూనిట్లతో పాటు సంచార జీవనం సాగిస్తున్న యాదవులు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల యూనిట్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని అన్నారు. వీరికి ఉపాధి మార్గాలను చూపేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. యాదవ సొసైటీకి ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టి సొసైటీ చైర్మన్‌లను నియమించాలని కోరారు. మల్లెత్తుల నరేష్, బండి శివకుమార్ యాదవ్, ఎరవేని కిట్టన్న, అల్లంల సత్తన్న, అల్లంల మల్లేష్, మాచర్ల గోపి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బండి సదానందం యాదవ్, ఎమెల్యేలు వివేక్, వినోద్

రహదారుల పక్కన విక్రయిస్తే చర్యలు

బెల్లంపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు ఎవరైనా రహదారుల పక్కన విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. బుధవారం చిరు వ్యాపారుల కోసం బంకర్ వద్ద స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. చిరు వ్యాపారులు రహదారుల పక్కన విక్రయించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ ఎదుట ఉన్న బంకర్ వద్ద చిరు వ్యాపారులకు స్థలం కేటాయించామని, మరో రెండు రోజుల్లో ఏర్పాట్లు పూర్తవుతాయని పేర్కొన్నారు. రహదారుల పక్కన విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



విద్యార్థి అంజికి ప్రశ్నంస పత్రం అందజేస్తున్న డీఈవో యాదయ్య

దండేపల్లి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌కు గుడిరేవు ప్రభుత్వ పాఠశాల చెందిన పదో తరగతి విద్యార్థి అంజి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లారి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచాడు. ప్రతిభ కనబరించిన అంజిని జిల్లా విద్యాధికారి యాదయ్య ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు. త్వరలో హైదరాబాద్‌లో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌కి అంజి ఎంపికయ్యారు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. గైడ్ టీచర్ సల్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తులు చేసుకోవాలి


గర్మిళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందానికి బ్రిడ్జి కోర్సు సెషన్ దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి జనవరి 30వ తేదీ వరకు మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

బోయపల్లిలో అయ్యప్ప పడిపూజ

తాండూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బోయపల్లి ఆంజనేయ ఆలయంలో గురుస్వామి రుకుం తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. అయ్యప్ప భక్తులు పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాండూరులో వాహనాల తనిఖీలు

తాండూరు అండర్ బ్రిడ్జీ చౌరస్తా వద్ద బుధవారం సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు, లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేటు ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న చాలనాలు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. తాండూరు, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య ఉన్నారు.






సీతాకోక చిలుకల కనువిందు

కవ్వాల్ అభయారణ్యంలో సీతాకోక చిలుకలు కనువిందు చేస్తున్నాయి. పలు ప్రాంతాల్లో సీతాకోక చిలుకలు పూల చెట్లపై వాలుతూ సందడి చేసే దృశ్యాలు కనిపిస్తున్నాయి. వీటిని అటవీ శాఖ అధికారులు కెమెరాలో బంధిస్తున్నారు.

- జన్నారం (ఆంధ్రజ్యోతి)



కరకట్టల నిర్మాణానికి సర్వే

- రాళ్లవాగుకు ఇరువైపులా అడ్డగోడలు
- వరద ముప్పు నివారణకు చర్యలు
- ఇప్పటికే నిధులు కేటాయించిన ప్రభుత్వం
- మంచిర్యాల పట్టణ వాసులకు తప్పనున్న ముంపు



రాళ్లవాగులో సర్వే జరుపుతున్న ఇరిగేషన్, లాండ్ సర్వే, రెవెన్యూ అధికారులు

మంచిర్యాల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణానికి ఇకమీదట వరద ముప్పు తప్పనుంది. యేటా వర్షాకాలంలో పట్టణాన్ని ముంచెత్తుతున్న రాళ్ల వాగు వరదలను నివారించేందుకు కర కట్టలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాగుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ (అడ్డుగోడ) నిర్మాణానికి అడుగు ముందుకు పడింది. ఇందులో భాగంగా బుధవారం అధికారులు రాళ్లవాగులో సర్వే జరిపారు. సంబంధిత నివేదిక ప్రభుత్వానికి అందజేసిన అనంతరం పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఏడు కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం

రాళ్లవాగుకు ఇరువైపుల 7.3 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టనున్నారు. వానాకాలంలో రాళ్లవాగు నుంచి సుమారు 60వేల క్యూసెక్కుల వరద గోదావరిలో కలుస్తున్నట్లు అంచనా. ఈ వరదకు తోడు గోదావరి బ్యాక్ వాటర్ కలిసి పట్టణంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీన్ని నివారించేందుకు రాళ్లవాగు వరద గోదావరిలో కలిసే చోటు నుంచి ర్యాలీగడ్‌పూర్ వెళ్లే బ్రిడ్జి వరకు గోడల నిర్మాణం చేపట్టనున్నారు. వాగు గోడ ఎత్తు, స్థానికంగా వాగు లోతును బట్టి నిర్మించనున్నారు. ఎత్తుగా ఉన్న చోట కనీసం 5 మీటర్లు, గోదావరిలో కలిసే చోట 14 మీటర్ల ఎత్తు వరకు ఉండనుంది.

గోదావరి నుంచి పాత మంచిర్యాల బ్రిడ్జి, అమరవీరుల స్తూపం, కార్మెల్ స్కూల్ ఆపైన ర్యాలీ వెళ్లే వంతెనకు సమీపం వరకు వాగుకు ఇరువైపుల రక్షణ గోడ నిర్మించనున్నారు. అలాగే బైపాస్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద హై లెవల్ వంతెన కూడా రూ.3 కోట్లతో నిర్మించనున్నారు. మరోవైపు వాగులోకి వర్షపు నీరు ప్రవహించేలా మూడు చోట్ల ఖాళీగా వదిలేసి, వరద వాగులోకి వచ్చేలా కరకట్టల నిర్మాణం సాగనుంది. అవసరమైన చోట గోడకు నిచ్చెనలు ఉంటాయి. వాగుకు సమీపంలో ఉన్న ఇళ్లకు ఇబ్బంది లేకుండానే గోడ నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

మిగతా 7వ పేజీలో..

నిధులు కేటాయించిన ప్రభుత్వం..

రాళ్లవాగుకు ఇరువైపులా కరకట్టలు నిర్మించేందుకు అవసరమైన నిధులు రూ.260 కోట్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలోని ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, కాళేశ్వరం వరకు ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ప్రభావంతో వర్షాకాలంలో గోదావరి ఉప్పొంగిన ప్పుడల్లా జిల్లా కేంద్రం వరద ముంపునకు గురవు తోంది. పట్టణం గుండా ప్రవహిస్తున్న రాళ్ల వాగులోకి గోదావరి బ్యాక్ వాటర్ రావడంతో కాలనీల్లోకి వరదలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని అనేక మంది ఇళ్లు నీట మునిగి ఆస్తి నష్టం వాటిల్లింది. ఎల్లంపల్లి డ్యాం గేట్లు ఎత్తిన ప్రతీసారి అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టు నుంచి లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే క్రమంలో బ్యాక్ వాటర్ సమస్య తలెత్తు తోంది. ఈ క్రమంలో శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్ నిర్మించాలనే నిర్ణయానికి రాగా అధి కారుల సర్వేతో కార్యరూపం దాల్చుతోంది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో కరకట్టల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

పెరిగిన చలి తీవ్రతతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

గర్మిళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చలి తీవ్రత పెరిగిందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ ఇన్‌ఫెక్షన్‌ల కారణంగా శరీరం బలహీనపడే అవకాశం ఉందన్నారు. చలి నుంచి రక్షణ కోసం వెచ్చని దుస్తులు ధరించాలన్నారు. తల, చెవులు, మెడను కప్పేలా స్కార్ఫ్‌లు, మంకీ క్యాప్‌లు వాడాలని సూచించారు. చల్లని పానియాలు తాగరాదని, వేడి ఆహారం పదార్థాలు తీసుకోవాలన్నారు. ఫ్రిజ్‌లో పెట్టిన పండ్లు, ఇతర ఆహారం తీసుకోరాదని సూచించారు. చలి కాలంలో రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలన్నారు. చర్మం ఎండిపోకుండా ఉండేందుకు కొబ్బరి నూనె, మాయిశ్చరైజర్‌ను వాడాలన్నారు. చలిలో వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం పొడిగా మారుతుందని, తగినంత వేడిని మాత్రమే ఉపయోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చలి నుంచి తట్టుకునేందుకు ఇండ్లలో మంటలను ఏర్పాటు చేసుకోరాదని, దీని వల్ల పొగతో ఊపిరి తిత్తుల సమస్యలు వస్తాయన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎలాంటి సమస్యలను ఎదుర్కోవడానికైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. సైకిల్, బైక్‌లపై తిరిగే వారు చలిని తట్టుకునే దుస్తులు ధరించాలన్నారు. సింగరేణి గనుల్లో పనిచేసే కార్మికులకు చలి కాలంలో దుమ్ముతో సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎపిడిమాలిస్టు సుమన్, జిల్లామాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

చలి తీవ్రత ఇలా...

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో బుధవారం 9.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 9.4 డిగ్రీలు, కోటపల్లి మండలం దేవులవాడలో 10.4 డిగ్రీలు, జన్నారం మండల కేంద్రంలో 10.3 డిగ్రీలు, భీమారం మండలంలో 10.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఖర్గేను కలిసిన ఎంపీ



ఖర్గేకు అంబేద్కర్ చిత్రపటం అందజేస్తున్న ఎంపీ వంశీకృష్ణ తదితరులు

మందమర్రిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తన సహచర ఎంపీలతో కలిసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలో బుధవారం కలిసి అంబేద్కర్ చిత్రపటం అందజేశారు. అంబేద్కర్ రాజ్యాంగంపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో పోరాడుతామని ఎంపీ తెలిపారు.

అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడడం సరికాదు

మందమర్రి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించే విధంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడడం సరికాదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులకు ప్రకటన పంపించారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు యావత్ దళితులను కించపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. 25 శాతం దళితులకు హక్కులు అందడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తమ చేతుల్లోకి తెచ్చుకునేలా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలిపారు. రెండు రోజుల క్రితం రాజ్యాంగంపై జరిగిన చర్చల్లో రాజ్యాంగంపై మాకు నమ్మకం ఉంది. రాజ్యాంగం మాకు అన్ని ఇచ్చింది అని చెప్పిన బీజేపీ ఇప్పుడు రాజ్యాంగం మార్చేందుకు ఎందుకు తెర లేపుతుందో అర్థం కావడం లేదన్నారు. యావత్ దళిత జాతి ఖండిస్తుందని, అంబేడ్కర్ చూపిన మార్గంలో అందరూ నడవాలన్నారు.

9వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ ఎదుట శిబిరంలో కూర్చున్న ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదవ రోజుకు చేరుకుంది. శిబిరాన్ని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు నిఖిల్, మంజునాథ్, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతిలు సందర్శించి మద్దతు తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎస్ఏ-జెఏసీ జిల్లా అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్న లు తెలిపారు.

భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నెన్నెల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీఈవో యాదయ్య సూచించారు. బుధవారం నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సన్నబియ్యం, కూరగాయల నాణ్యత, భోజనాన్ని వండుతున్న విధానాన్ని పరిశీలించారు. వంటగది, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట చేసేవారు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. నూతన మెనూ అమలు, భోజనం రుచిపై వాకబు చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది, విద్యార్థుల హాజరు శాతంపై ఎస్‌వో, హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో శతశాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.



కంది ఆశాజనకం

- పూత, కాత దశలో పంట
- మండలంలో 4 వేల ఎకరాల్లో సాగు
- రైతులను భయపెడుతున్న పురుగు ఉధృతి

6

అటు విధులు.. ఇటు ప్రదర్శనలు

సింగరేణిలో రెండున్నర దశాబ్దాల క్రితం కమ్యూనికేషన్ సెల్ ఏర్పాటు

రక్షణ, ఉత్పత్తిపై కళా ప్రదర్శనలు

కల్చరల్‌మీట్‌లో కార్మికుల ఆర్కెస్ట్రా



7

ప్రజలకు అండగా ఉండడమే పోలీసుల కర్తవ్యం

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

వేమనపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అండగా ఉండడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వెయ్యి మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పోలీసు శాఖ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ మందులను ఉచితంగా అందిస్తుందన్నారు. వేమనపల్లి మారుమూల మండలం కావడంతో ఇక్కడి ప్రజలు నిరక్షరాస్యులుగానే ఉంటున్నారని పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని , ప్రతీ ఒక్కరు చదువుకోవాలని సూచించారు. చదువుకోవ డానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలను సమకూర్చు తుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఆదివాసీలు ప్రగతి మార్గం వైపు పయనించేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించేలా చూడడమే పోలీసుల ధ్యేయమని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని, మావోయిస్టులకు సహాయ సహకారాలు అందించ వద్దని పేర్కొన్నారు.

ఏమైనా సమస్యలుంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, యువకులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు భోజన సదుపాయం కల్పించారు. రూ. 2 లక్షలకు పైగా విలువైన మందులను ప్రజలకు అందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, చెన్నూరు, నీల్వాయి, కోటపల్లి, జైపూర్ ఎస్ఐలు రవీందర్, శ్యామ్ పటేల్, రాజేందర్, శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్, పోలీసులు పాల్గొన్నారు.





వేమనపల్లిలో వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు, మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

బహుమతులు ప్రతిభకు తార్కాణాలు

శ్రీరాంపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొందే బహుమతులు ఆ వ్యక్తి ప్రతిభకు తార్కాణాలు అని సేవా అధ్యక్షురాలు మాలతి అన్నారు. సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ముగ్గులు, దీపాలంకరణ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిత్యం ఇంటి పనులతో బిజీగా ఉండే మహిళలు ఆట విడుపుగా ఇలాంటి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా తమ అభిరుచి మేరకు ముగ్గులు, దీపాలంకరణలో పాల్గొని ప్రతిభను చూపడం సంతోషదాయకమన్నారు. శ్రీరాంపూర్‌తోపాటు పరిసర ప్రాంతాల మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయతోపాటు పది ప్రోత్సాహక బహుమతులు ఈ నెల 23న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో నిర్వహించే సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో అందించనున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, సీనియర్ పీవోలు కాంతారావు, శంతన్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, న్యాయ నిర్ణేతలు హేమ, లత, అనురాధ, సేవా సభ్యులు, శిక్షకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



బాక్సింగ్ క్రీడాకారుడితో మాట్లాడుతున్న కలెక్టర్‌కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజ్‌వీరు, డీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో గణపతితో కలిసి పోటీలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యతను ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా సీఎం కప్ 2024 పోటీలను జిల్లాలో విజయవంతం చేసేదిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయిలో జరుగనున్న పోటీలలో క్రీడాకారులు రాణించి జిల్లాకు పేరు తీసుకరావాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఉషోదయ ఉన్నత పాఠశాలలో ఖోఖో, రెజ్లింగ్, బేస్‌బాల్, చెస్, సెవన్‌హిల్స్ పాఠశాలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. 20న కరాటే, జూడో, హ్యాండ్‌బాల్, ఉషూ, 21న హైటెక్ సిటి క్లబ్‌లో బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, అత్యాపత్యా, టేబుల్ టెన్నిస్, ఇతర క్రీడలు నిర్వహిస్తామన్నారు. క్రీడల పోటీలో గెలుపు ఓటమి సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తిగా ముందుకు సాగాలన్నారు.

మినీ జాబ్‌మేళాలో 96 మంది ఎంపిక

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 96 మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి రవికృష్ణ వెల్లడించారు. మెడిప్లస్ కరీంనగర్ ఆధ్వర్యంలో బుధవారం 220 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 187 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యామని, వీరిలో అర్హత గల 96 మంది ప్రాథమికంగా ఎంపికయ్యారన్నారు. ఐటీఐ కళాశాల శిక్షణ అధికారి దత్తాత్రి, మెడ్‌ప్లస్ సంస్థ ప్రతినిధి రాజు పాల్గొన్నారు.